కథ

# స్వయంకృతం

-శ్రీభాష్యం పద్మ

"ఏమండీ! బబ్లూని రెసిడెన్షియల్ స్కూల్‌లో చేర్చే విషయంలో ఇంకోసారి ఆలోచించకూడదూ!" అభ్యర్ధనగా అంది లక్ష్మి.

"లేదు లక్ష్మి! ఈ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చేసినట్లే, రేపే బబ్లూని తీసుకెళ్లి రెసిడెన్షియల్ స్కూల్లో చేరుద్దాం అనుకుంటున్నాను" ఖచ్చితంగా చెప్పేశాడు సత్యమూర్తి.

"అది కాదండీ! వాడి వయసింకా ఎంతని! వాడినిప్పటి నుంచే వేరుగా ఉంచితే ఉండలేడండీ! పైగా వాడికన్ని నేనే చేయాలి. వాడంతట వాడి పన్లు చేసుకునే వయసొచ్చినప్పుడు, రెసిడెన్షియల్ స్కూల్‌కి పంపించవచ్చు. కాస్త పెద్దవాడైతే వాడికి హోమ్‌సిక్‌నెస్ ఎక్కువగా ఉండదు" అంది లక్ష్మి.



"లేదు! మన దగ్గర అలవాటైతే, అసలు ఉండడు వేరే చోట. ఆ స్కూల్‌లో ఎల్.కే.జీ. నుంచి, పోస్టుగ్రాడ్యుయేషన్ వరకూ ఉంది. ఇప్పుడే చేర్పిస్తే, వాడు ఆ వాతావరణానికి అలవాటు పడతాడు. ఏకంగా చదువు పూర్తి చేసుకునే బయటకు వస్తాడు. అయినా! అక్కడ నీకన్నా బాగాచూసే ఆయాలు, వార్డెన్‌లూ ఉంటారులే!" తేల్చేశాడు సత్యమూర్తి.

"అమ్మా! నేను నీ దగ్గరే ఉంటాను. ఎక్కడికీ వెళ్లను. ఇక్కడే చదువుకుంటాను" అంటూ ఏడ్చిన బబ్లూని అనునయించ లేకపోయింది ఆ తల్లి.

లక్ష్మి వేడికోలునీ, 'అమ్మా! అమ్మా!' అంటూ ఏడుస్తున్న బబ్లూ ఏడుపునీ పట్టించుకోకుండానే, బబ్లూని తీసుకెళ్లి రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించొచ్చాడు సత్యమూర్తి.

ఒంటరిగా వచ్చిన సత్యమూర్తిని చూసి ఏడుపాపుకోలేక పోయింది లక్ష్మి. "పిచ్చిదానా! నాకు మాత్రం బబ్లూ అంటే ప్రేమలేదా? వాడి మంచికోసమే కదా నేనీ పని చేసింది! వాడుకూడా నాలా గుమాస్తా కాకుండా, ఆఫీసరు అవ్వాలనేదే నా కోరిక. పైఆఫీసరు దగ్గర చేతులు కట్టుకున్నప్పుడల్లా నాకేమనిపిస్తుందో తెలుసా! మానాన్న కూడా నన్నింకా మంచి స్కూల్లో, మంచి కాలేజీలో పెద్ద చదువులు చదివించి ఉంటే, నేనూ ఆ ఆఫీసర్లాగే ఫోజు కొట్టేవాడిని కదా! అని నా కొడుకు పెద్దవాడై, నాలా అనుకోకూడదనే నేనీ పని చేసింది" అంటూ అనునయించాడు సత్యమూర్తి.

సత్యమూర్తి ఎంత చెప్పినా, లక్ష్మి, అమ్మ మనసు సరిపెట్టుకోలేకపోయింది. అనుక్షణం పసితనం వీడని బబ్లూ ముఖమే కనపడేది. సత్యమూర్తి కసాయితనంగా, ఆ పసిమనసుమీద తన ఆశయాన్ని రుద్దుతున్నాడనిపించేది. కాని భర్తకు ఎదురుచెప లేకపోయింది.

బబ్లూ సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు, వాడికీ, లక్ష్మికీ పండుగే. తల్లి దగ్గరుంటే స్వర్గంలా ఉండేది వాడికి. వాడున్నన్నాళ్లూ లక్ష్మి ఎటెన్షనంతా వాడిమీదే. వాడికోసం, వాడికిష్టమైనవన్నీ చేసి దగ్గరుండి కొసరి, కొసరి తినిపించేది. తనే స్నానం చేయించి బట్టలు తొడిగి ముస్తాబు చేసేది. రాత్రిపూట పక్కన పడుకోబెట్టుకుని, కథలు చెప్తూ నిద్రపుచ్చేది. ఇవన్నీ బాగా నచ్చేవి బబ్లూకి. హాస్టల్‌లో అయితే తననెవరూ పట్టించుకోరు. తననేంటి, ఏ స్టూడెంట్‌నీ పట్టించుకోరు. వార్డెన్‌లూ, ఆయాలూ డ్యూటీగా ఓ మారువచ్చి, అన్నం తిన్నారా? లేదా? నిద్రపోతున్నారా? లేదా? చదువుతున్నారా? లేదా అని చూసిపోతుంటారు కాని, అమ్మలా ఎవరూ ప్రేమగా చూడరు. అందుకే వాడికి అమ్మ దగ్గరే ఉండిపోవాలని అన్పించేది.

సెలవు లైపోగానే సత్యమూర్తి ప్రయాణం కడితే తల్లిదగ్గర ఏడ్చేవాడు. "నేనా స్కూల్‌కి వెళ్లను, నీదగ్గరే ఉంటాను" అని. తండ్రి దగ్గర వాడికంత చనువు లేదు. సత్యమూర్తికి పిల్లాడిని క్రమశిక్షణలో పెంచకపోతే వాడెక్కడ చెడిపోతాడో అని వాడినెక్కువ ముద్దు చెయ్యడు. వాడి ఏడుపు సత్యమూర్తి ముందు, చెవిటివాడి ముందు శంఖమే అయ్యేది.

నాలుగైదేళ్లు గడిచేసరికి బబ్లూ స్కూలు వాతావరణానికి అలవాటు పడ్డాడు. ఇంటికెళ్లి అమ్మదగ్గర ఉందామన్నా తండ్రి ఉండనీయడు అని వాడి మనసుకు అర్థం అయిపోయింది. స్కూల్లో ఫ్రెండ్స్, చదువు, ఆటలతో, తల్లిమీద అనుబంధం తగ్గించుకున్నాడు.

000

"ఏమండీ! మామయ్యగారికి ఓల్డేజ్ హోంలో చేర్పించే విషయంలో ఇంకోసారి ఆలోచిస్తే బాగుంటుందేమో" అంది సుధ.

"లేదు సుధా! ఇంకేం ఆలోచించేది లేదు. ఈ విషయంలో నిర్ణయం జరిగిపోయింది. రేపే నాన్నని ఓల్డేజ్ హోంలో చేర్పించేది!" అన్నాడు సురేంద్ర ఉరఫ్ బబ్లూ.

"అది కాదండీ! అత్తయ్య పోయిన దగ్గర్నుండీ మామయ్య మరీ డీలా పడిపోయారు. ఇప్పుడు మనంకూడా దగ్గర లేకపోతే, ఆయన ఒంటరితనం ఫీలై మరింత బాధపడతారు" అంది సుధ.

"ఆయన కెవరితోనూ అంత అనుబంధాలు లేవులే! చిన్నప్పుడే నన్ను రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించి హాయిగా ఉండగలిగారాయన. అందుచేత మనకోసం బాధపడరులే! అయినా! నేనేం కావాలని ఆయనను ఓల్డేజ్ హోంలో చేర్పిస్తున్నానా? మనం ట్రాన్స్‌ఫరై వెళ్లేది విపరీతమైన చలి ప్రదేశం. ఆ వాతావరణం ఆయన తట్టుకోలేరనే కదా! పైగా మన భాషకాదు. తెలిసిన ముఖం ఒక్కటి కన్పించదు. ఆ హోంలో అయితే అన్నీ సదుపాయాలున్నాయి. అందరూ ఆయన వయసువారే ఉంటారు. ఒంటరితనం అన్పించదు. అన్నీ చేసి పెట్టడానికి ఆయాలు ఉంటారు. ఇంకేం కావాలి" అన్నాడు సురేంద్ర.

"అన్నీ ఉన్నా, అయినవాళ్లు దగ్గరున్నట్లు ఉండదు కదండీ!" అంది సుధ.

"ఇంకేం మాట్లాడకు! నాన్న ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ జరిగిపోయాయి" సంభాషణ తుంచేస్తూనే లేచిపోయాడు సురేంద్ర.

పక్కగదిలోంచి వాళ్ల మాటలన్నీ విన్న సత్యమూర్తికి, అర్థం అయిపోయింది. తన మూర్ఖత్వంతో తనేం కోల్పోయాడో.

■

